క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామంలో రొడ్డ అడెల్లు అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రోజూ మాదిరి మేత కోసం వెళ్లిన ఆవు డాక్టర్ శ్యామ్ చేనులో మేస్తుండగా విద్యుత్ సరఫరా అవుతున్న సపోర్ట్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఎల్ఐ శ్రీనివాసరాజు, ఏఎల్ఐ హఫీజ్, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

గజ్జలమ్మదేవికి పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ అమ్మవారిని వేడుకున్నారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కుంటాల: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను స్వాగతిస్తూ మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు ఉంబిరి లక్ష్మణ్, కోశాధికారి ప్రభాకర్, సభ్యులు కుమ్మి సాయినాథ్, సంతోష్, గంగన్న, అరుణ్, ప్రవీణ్, భోజన్న, శ్రీనివాస్, ఎం.ప్రవీణ్, రాజు, గజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన గడ్డం భూమవ్వ పేరిట రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం ఆమె భర్త చిన్న భూమన్నకు బీజేపీ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, నాయకులు దత్తురాం, బొల్లి గంగా రాం, రాజేందర్, నడిపి రాజన్న పాల్గొన్నారు.

సారంగాపూర్ వీడీసీ ఎన్నిక

కడెం: మండలంలోని సారంగపూర్ గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ పెద్ద మనుషులుగా సందు శ్రీనివాస్, ఆర్మూర్ గంగాధర్, అందే సత్తెన్న, పాదం రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కోల శ్రీనివాస్, జెట్టి నర్సయ్య, కుమ్మరి సుధాకర్, మాదాసు నర్సయ్య తదితరులున్నారు.

పేదింటి యువతుల వివాహానికి చేయూత


పుస్తె, మట్టెలు అందజేస్తున్న సభ్యులు

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్, గోసంపల్లె గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన పేదింటి యువతుల వివాహానికి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు చేయూతనిచ్చారు. పాతఎల్లాపూర్‌కు చెందిన శారదతోపాటు గోసంపల్లెకు చెందిన అమూల్య వివాహాలకు ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున మొత్తం రూ.16 వేల విలువైన పుస్తె,మట్టెలను అందజేశారు.

‘సుప్రీంకోర్టు తీర్పు సరికాదు’

కుంటాల: ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కల్లూరులో 61 వజాతీయ రహదారిపై ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు.

కుంటాలకు చేరిన పల్లకి

కుంటాల: శ్రావణమాసం పురస్కరించుకుని కుభీర్ మండలంలోని పార్డి(బి) శ్రీ రాజరాజేశ్వరాలయ పల్లకిని దిలావర్‌పూర్ మండలం కదిలి శ్రీ పాపహరేశ్వర ఆలయానికి గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం తీసుకెళ్లారు. ఆలయంలో పూజల అనంతరం పల్లకి శనివారం రాత్రి కుంటాలకు చేరింది. ఆదివారం డప్పు, వాయిద్యాలతో పల్లకిని వీధుల్లో ఊరేగించారు. ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- గుంతలు పడి ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు


గుంతలమయంగా దొడన్నాకు వెళ్లే రోడ్డు


బెల్గాంకు వెళ్లే రోడ్డు దుస్థితి

కుభీర్: మండలంలోని కుభీర్ నుంచి బెల్గాం, కుభీర్ నుంచి దొడన్నా వెళ్లే బీటీ రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్లు ప్రారంభం నుంచి చివరి వరకు గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తుండటంతో ఎక్కడా గుంత ఉందో తెలియక వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. వాహనాలు సైతం తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని.. అధికారులు స్పందించి ఈ రెండు మార్గాల్లో రోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

నరకంగా కుభీర్–బెల్గాం రోడ్డు..

మండలంలోని కుభీర్ నుంచి బెల్గాం వరకు ఉన్న తొమ్మిది కిలోమీటర్ల బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కుభీర్ నుంచి బెల్గాం వరకు ఐదు కిలోమీటర్లు.. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు మరో నాలుగు కిలోమీటర్లు రోడ్డు విస్తరించి ఉంది. సరిహద్దు ప్రాంతానికి కొంత దూరంలో రెండు తండాలున్నాయి. కుభీర్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో దార్‌కుభీర్ ఉంది. కుభీర్, ధార్‌కుభీర్, బెల్గాం, రెండు తండాల ప్రజలు ఈ రోడ్డుపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దార్‌కుభీర్, బెల్గాం దగ్గర ఉన్న కల్వర్టులు తెగిపోయి రెండేళ్లవుతున్నా.. అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. ఆయా చోట్ల కొంత మొరం పోయించి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనాలు బురదలో దిగబడుతున్నాయి.

> **నిధులు మంజూరయ్యాయి**
>
> బెల్గాం రోడ్డుకు ఆర్అండ్‌బీ నిధులు, దొడర్నాకు ఐటీడీఏ నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ సైతం మంజూరైంది. వర్షాకాలం ముగియగానే పనులు ప్రారంభిస్తాం. గతంలో మూడుసార్లు నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు.
>
> – సునీల్, ఆర్అండ్‌బీ డీఈ, భైంసా

మరిన్ని వర్షాలు కురిస్తే ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

దెబ్బతిన్న కుభీర్–దొడర్నా బీటీ రోడ్డు..

కుభీర్ నుంచి దొడర్నా వరకు 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు ఉంది. డొడర్నా నుంచి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు మరో నాలుగు కిలోమీటర్లు రోడ్డు విస్తరించి ఉంది. ఈ రోడ్డుపై దొడర్నా గ్రామస్తులతోపాటు దొడర్నా పేరిట ఉన్న మరో ఆరు తండాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. పైగా మహారాష్ట్రలోని హిమాహిత్‌తోపాటు పలు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపైనే నుంచే వచ్చిపోతారు.

ప్రధానమంత్రి సడక్ యోజన విధులతో నిర్మించిన ఈ రోడ్డుకు 15 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో బీటీ మొత్తం లేచిపోయింది. కొండ ప్రదేశం కావడంతో మట్టి గట్టిగా ఉన్నా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి.

గతంలో మండల పర్యటనకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఈమార్గంలో రోడ్డు మంజూరైందని చెప్పినా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఇటీవల మండలానికి వచ్చినప్పుడు త్వరలో ఈ మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

> **నడపడం ఇబ్బందిగా ఉంది**
>
> 
>
> బెల్గాం రోడ్డుపై ద్విచక్రవాహనాలు నడపడం ఇబ్బందిగా ఉంది. బండ్లు బురదలో ఇరుక్కుంటున్నాయి. రాత్రివేళ రాకపోకలకు కష్టమవుతుంది. పలుమార్లు అదుపుతప్పి కింద పడుతున్నాం. ప్రభుత్వం త్వరగా నూతన రోడ్డును నిర్మించాలి.
>
> – షానే ప్రమోద్, దార్‌కుభీర్
>
> **పనులు ప్రారంభించాలి..**
>
> 
>
> 15 ఏళ్ల కిందట దొడర్నాకు రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేయించలేదు. మూడేళ్లుగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పాలకులు చెబుతున్నారు కానీ పనులు ప్రారంభించడం లేదు. ఇప్పుడైనా నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి.
>
> – చవాన్ సంజయ్, దొడర్నా

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సారంగపూర్: వచ్చే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సల్ల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని జామ్ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రామంలోని గణేశుడి మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ అధికారుల అనుమతి తీసుకొని మండపాలకు విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా పోలీస్‌శాఖకు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తే సంబంధిత ఇంటి, లేదా స్థల యజమాని అనుమతి పత్రం జత చేయాల్నారు. దీంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యువకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మద్యం సేవిస్తే చర్యలు తీసుకోండి

లోకేశ్వరం: పాఠశాలల ఆవరణలో మద్యం సేవించే మందుబాబులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఈవో చంద్రకాంత్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కన్కపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తూ.. పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని అన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. పోలీసులు వెంటనే విచారణ జరిపి పాఠశాలల్లో మద్యం తాగే వారిని పట్టుకొని శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వెంట కన్కపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ ఉన్నారు.

ఆపదలో ఆదుకున్న మిత్రులు


నర్సాపూర్(జి)లో సాయం అందించిన మిత్రులతో సరిత

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన గడ్డం సరిత భర్త ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మండల కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమెతో కలిసి 1999–2000లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, మిత్రులు తలా కొంత నగదు జమచేశారు. ఆదివారం రూ.42,500 నగదును సరితకు అందజేశారు.


లక్ష్మణచాందలో సాయం అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన గరిపెల్లి సురేశ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలిసి లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సురేశ్‌తో కలిసి 1995–96లో పదోతరగతి చదివిన మిత్రులు తలా కొంత పోగు చేసి రూ.27వేలను సమకూర్చారు. ఆదివారం బాధితుడికి నగదును సాయంగా అందించారు. కార్యక్రమంలో మిత్రులు ఈటెల శ్రీనివాస్, సీరాజ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సాఠేను ఆదర్శంగా తీసుకోవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ అన్నాభావు సాఠేను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తం బాలేరావ్ సూచించారు. ఆదివారం మండలంలోని ఖర్బాల గ్రామంలో సాఠే 104వ జయంతి నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధర్, సంజూరావ్ పటేల్, మాజీ ఉపసర్పంచ్ సంజయ్, గాడేకర్ సాయినాథ్, ఆనంద్, సచిన్, సురేశ్, గోనేకర్ భోజారాం తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో అన్నాభావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తక్కెల గంగాధర్, ఉపాధ్యక్షుడు ఉంబిరి లక్ష్మణ్, సభ్యులు ప్రభాకర్, కుంబి సాయినాథ్, అరుణ్ శ్రీనివాస్, గంగన్న, భోజన్న, గజ్జన్న, ప్రవీణ్, రాజు, ఎం.ప్రవీణ్, సంతోష్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ అన్నాభావు సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలని మాదిగ సంఘం మండలాధ్యక్షుడు సతీశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మోర గ్రామంలో సాహిత్యరత్న సాఠే 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంద భాస్కర్, నర్సయ్య, శ్రీనివాస్‌రావు, సాహెందర్, అనిల్ పటేల్, పోశెట్టి, బాతూరి భూమన్న, బాలి శ్రీకాంత్, సురేశ్, బాలి సాయన్న, చిన్న భూమన్న, రాకేశ్ పాల్గొన్నారు.


తానూరు : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌లో..


లోకేశ్వరం: ధర్మోరలో నివాళులర్పిస్తున్న సభ్యులు

సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా మట్టితో శివలింగాన్ని తయారు చేసి పూజించారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అమేడి కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముత్యం, సంతోష్ గుప్తా, అమేడ అర్చన, చిన్నావార్ కమలేశ్వరి, ఉత్తూర్ భార్గవి, సభ్యులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి


జయంతి వేడుకలో గ్రామస్తులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 వ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ పోరాటయోధుడు పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకొని వారి ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథాలగుడిలో కృష్ణాష్టమి



నిర్మల్: జిల్లాకేంద్రంలోని వందల ఏళ్ల నాటి చారిత్రక రథాలగుడి హరి హర దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, సాయంత్రం డోలోత్సవం, ఉట్టి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కమల్‌నయన్, అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి రాజేందర్, నాయకులు వెంకటపతి, పంతికే ప్రకాశ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చిమొక్కలు తొలగించరూ..



కడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి. దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఫోన్: 83095 98795

కొలువులు సాధించిన వారికి సన్మానం


కుంటాలలో సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: ఇటీవల వెలువడిన తెలంగాణ గురుకుల పీఈటీ ఫలితాల్లో కుంటాలకు చెందిన యువకులు ఎనుగందుల సాగర్, సబ్బిడి దేవేందర్, జుట్టు శ్రీకాంత్ ఉద్యోగాలు సాధించారు. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా చాట్ల గాయత్రి ఇటీవల పురస్కారం అందుకున్నారు. ఆదివారం వీరిని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ యువత సమయం వృథా చేయకుండా లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఏ.రహీం, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు, హెచ్ఎం చాట్ల శ్రావణ్‌కుమార్, ఉద్యోగులు నారాయణ, వివేకానంద, హరీశ్, గ్రామపెద్దలు జుట్టు వెంకటేశ్, జక్కుల గజేందర్ పాల్గొన్నారు.

విఠోలిలో అధికారులకు..

ముధోల్: మండలంలోని విఠోలిలో గ్రామస్తులు ఆదివారం బదిలీపై వెళ్లిన వారితోపాటు బాధ్యతలు స్వీకరించిన నూతన అధికారులను సన్మానించారు. విఠోలి వ్యవసాయాధికారి ఎస్‌కే. సిరాజ్ దౌల్తాబాద్ ఏఈవోగా బదిలీపై వెళ్లారు. విఠలో గ్రామ పంచాయతీ ఈవోగా భాస్కర్ స్థానంలో రుషికేశ్ బాధ్యతలు స్వీకరించారు. వీరిని గ్రామ రైతులు, వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఖిల్లాగుట్ట మైసమ్మకు బోనాలు


గుట్ట వద్ద భక్తుల సందడి

నిర్మల్: జిల్లాకేంద్రంలోని ఖిల్లాగుట్టపై కొలువుదీరిన బంగారుమైసమ్మకు ఆదివారం బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ప్రతి వాడ నుంచి బోనాలు తీసుకొచ్చి పట్టణవాసులను సల్లంగ చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. ద్యాగవాడ సారగమ్మ తదితర ఆలయాల్లోనూ బోనాలు సమర్పించారు. భారీగా భక్తులు తరలిరావడంతో చారిత్రక ఖిల్లాగుట్ట కిటకిటలాడింది.

దరఖాస్తుల ఆహ్వానం

కుభీర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులు, ఆసక్తి కల్గిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో బి.చంద్రకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. వాచ్‌మెన్–2, స్వీపర్–1, స్కావెంజర్–1 మొత్తం నాలుగు పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పరామర్శ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి సత్యంను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి డాక్టర్‌ను తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.